


# తూచ్ కట్టి... రెండేసి కట్టి...

బడి నుంచి వచ్చేలకు దిబ్బలకాడ పెద్దోళ్ల నవ్వులు, మాటలు ఇనిపిస్తా వుండాయి. పుస్తకాలు గడప బయటినుంచే లోపలికి ఇసిరి కొట్టి పరిగెత్తా దిబ్బలకాడికి పోయినా.

నారాయన చిన్నాయన, శివరాంమామ, జనన్న, చిన్నప్పమామ, సురేంద్రన్న, అప్పామామ, బాబన్న, బుజ్జాసాబన్న, చంద్రన్న, ఇంగో ఐదారు మందుండారు. జిల్లాకోడి ఆడతాండారు. జనన్నోళ్ళ ఇంటికి ఎనకాల దిబ్బలుండాయి. దిబ్బలకు జనన్నోళ్ల ఇంటికి మద్దెలో చానా బీడుజాగా వుండాది. ఆ జాగాలోనే అందురూ జిల్లా కోడి ఆడతాండారు. నా ఎనకే వేను, మదన, గొస్పీర్, రెడ్డీబాషా, దస్తగీర్, చిన్నబుజ్జి, సుదాకర్, పెద్దబుజ్జి, అనిత వచ్చేసినారు.

జిల్లా కోడంటే నాకు బలే యిస్టం. నారాయన చిన్నాయన కుచ్చోనుండాడు. ఈళ్లు జిమ్మే పక్కనుండారు. నేను దెగ్గిరికి పోయి ''చిన్నాయనా... చిన్నాయనా... నేనాడతా'' అన్నే.

''బలే ఆన్నేవులే... పోరా దూరంగా. జిల్ల తగిలిందనుకో... ముదరకపోతావ్ ...'' అన్నేడు అప్పామామ.

నేనింటానా. మా చిన్నాయనుండ్లా. ఎంట పన్నే. నా ఎనకాలే తోకమాదిరిగా వేను నిలబడుకోనుండాడు.

మేము చానా చిన్నపిల్లగాల్లం కదా. జిల్ల తగిలితే ఏడస్తామని మమ్మల్ని పెట్టుకోరు.

''నువ్వాడతావా వేను'' అన్నేడు చిన్నాయన.

''ఆడతాన్నా...'' అన్నేడు వేను.

''నువ్వీపక్కనుండు... నువ్వా పక్క పో వేను'' అన్నేడు.

నేను నొగుతా మా చిన్నాయన పక్కకు పోయి కుచ్చొన్నే. వేను పరిగెత్తా ఆపక్కకుపోయి నిలబడుకున్నేడు.

జానడు పొడుగు, మూడడ్డేళ్ల లోతుండే బద్దిపైన జానడు పొడుగుండే జిల్లను అడ్డంగా పెట్టినాడు శివరాంమామ. ఆ జిల్లకు రెండు కొనాల సన్నగా జుగిరిండారు. మోరడు పొడుగుండే కోడిని తీసుకోని జిల్లను గట్టిగా జిమ్మినాడు. ఆ పక్కనుండే వోళ్ల తలలమిందిగా పోయి మా దిబ్బలో పడిందది. జిమ్మతానే కోడిని బద్ది పైన ఆడ్డంగా పెట్టినాడు. ఆ పక్కన్నించి జిల్లను కోడికి పట్టి ఇసిరేసినారు. ఆది కోడికి తగల్లా. తగిలింటే గన శివరాంమామ ఔటయిపోయిండు. తగలకుండా పోయాలకు కోడిని తీసుకోని బద్దికాన్నించి కొలత పెట్టినాడు.

ఒక్కట్టి కొలత పెట్టినాడు... ''తూచ్‌కట్టి'' అన్నేడు. రెండో కట్టి కొలత పెట్టినాడు... ''రెండేసికట్టి'' అన్నేడు. మూడో కట్టి కొలత పెట్టి ''మూడేసి కట్టి '' అన్నేడు. నాలుగో కట్టి కొలత పెట్టి ''నాలుగునార '' అన్నేడు. ఐదో కట్టికి చాల్లా. ఆట్నించి జిల్లను తీసుకోని బద్ది దగ్గిరికి వచ్చినాడు. కోడిని కుడిచేత్తో పట్టుకున్నాడు. జిల్లను పిడికిలి దగ్గిర మణికట్టు మింద పెట్టుకోని ఎగరేసి కోడితో కొట్టినాడు. జనన్న పట్టుకొనేదానికి చూసినాడు. దొరకలా. అది జిల్లపడింతావుకుపోయి కోడితో జిల్లకొనాన చిన్నగా కొట్టినాడు. అది పైకిలేస్తానే గట్టిగా కొట్టినాడు. జిల్లకు కొనాన తగులుకునింది. ఎక్కువ దూరంపోలా. మల్లా జిల్లను కొనాన కొట్టినాడు. రెండో దెబ్బ తగల్లా. మూడో దెబ్బ కొట్టినాడు. జిల్లకు కొనాన తగిలింది కానీ ఎగర్లా.

ఆట్నించి కోడితో కొలత బెడతా ''తూచ్ కట్టి.... రెండేసి కట్టి... మూడు ముంచ... నాలుగునార... ఐదు గిరిగి... ఆరు పటక... ఏడు బిల్లి... తూచ్‌కట్టి... రెండేసి కట్టి... మూడు ముంచ... నాలుగు నార...'' లెక్క పెట్టినాడు. మూడు బిల్లులయ్యి రెండేసి కట్టి మిగిలింది.

''మొత్తం పది బిల్లులు. '' అన్నేడు శివరాంమామ.

''యాడ... ఎనిమిదే కదా'' అన్నేడు అప్పామామ. అప్పామామ బలే మొండాడతాడు.

''ఇంతకు ముందే ఏడు బిల్లులుకదా. ఇప్పుడు



మూడు బిల్లులు. మొత్తం పది బిల్లులు'' అన్నేడు నారాయనచిన్నాయన.

''ఔనులే... నువ్వాడు శివరాం'' అన్నేడు బుజ్జాఅన్న.

రెండేసి కట్టి కదా. ఎడం చేతి చూపుడేలు, చిటికెనేలు సాంచుకోని ఆ ఏల్లమింద జిల్లను పెట్టుకున్నాడు. కుడి చేత్తో కోడిని పట్టుకోని ఎడం చేతిలోని జిల్లను ఎగరేసి కొట్టినాడు శివరాంమామ.

జిల్ల గిర్రన తిరగతా పోయింది. బాబన్న టకామని దాన్ని పట్టుకునేసినాడు. శివరాం మామ ఔటయిపోతానే వాళ్లంతా బద్ది దెగ్గిరికి వస్తాండారు.

''మావోడు వుండాడుప్పా'' అన్నేడు నారాయన చిన్నాయన.

''ఓ... ఈ పిల్లనాయాలుండాడు కదా. మరచే పోయినాం. నువ్వేం ఆడతావ్ వాయ్'' అన్నేడు అప్పామామ.

''బాగాడతా...'' అన్నే కోడిని చేతిలోకి తీసుకోని.

''సరే కానీ'' అన్నేరు వాళ్లు.

జిల్లను బద్దిమింద పెట్టి కోడితో పానమంతా ఉగ్గబట్టి గట్టిగా జిమ్మినా. అది పైకి లేచింది. దాన్ని నొగతా పట్టుకున్నేడు బుజ్జాఅన్న.

మేమందరం అపక్కకు పోయినాం. యిప్పుడు వాళ్లు జిమ్మతా ఉండారు.

నూరు బిల్లులకు ఆట పెట్టుకున్నేరు. వోల్లు జిమ్మతాండారు. కొడతాండారు. ఔటయితాండారు. మేము జిమ్మతాండాము. ఔటయితాండాము. పొద్దుపోతాండాది.

మొత్తం కోడితో ఏడు సార్లు కొలిస్తే ఒగ బిల్లి. ఒక కట్టి ఉంటే తూచ్ కట్టి. అప్పుడు జిల్లను కుడి చేతిలోనే పిడికిలి మింద ఏళ్లపైన పెట్టుకోని ఎగరేసి కొట్టాల. రెండేసి కట్ట ఉన్నెప్పుడు ఎడం చేతి రెండు ఏల్లమింద పెట్టుకోని ఎగరేసి కొట్టాల. మూడు ముంచ అన్నెప్పుడు కుడి చేతి పిడికిలిని బిగించి ఏల్లమింది పెట్టుకోని ఎగరేసి కొట్టాల. నాలుగునార వచ్చినప్పుడు కుడి చేతి మనికట్టుమింద, ఐదు గిరికి అన్నెప్పుడు ఎడం చేత్తో జిల్లను గిర్రన తిరిగేటిగా పైకి ఎగరకొట్టి కొట్టాల. ఆరు పటక వచ్చినప్పుడు కుడి మోచేతిగుంటలో జిల్లను ఎట్టుకోని ఎగరేసి కొడతారు.

మాయ్యి ముందుగా నూరు బిల్లులు అయిపోయినాయి. బద్దికి సుట్టకారం బారడు దూరం వుండేటిగా గుండ్రోతంగా గీత గీసినారు. మద్దెలో నిలబడోని జిల్లను ఎడం చేత్తో పట్టుకోని ఎగరేసి కోడితో మూడు దెబ్బలు గాల్లోనే కొట్టాల. ఆ మాదిరిగా మూడుసార్లు చాన్సు. ఒగసారి మూడు దెబ్బలు కొట్టినోళ్ల గుడిగించచ్చు. జిల్లను కొట్టేటప్పుడు అపక్కనోళ్లు పట్టుకుంటే ఔటే.

వోల్లు గీత సుట్టకారం నిలబడుకోనుండారు. ముగ్గురిది జిల్లను పట్టుకునేసినారు. నేను మూడు సార్లు జిల్లను గాల్లో కొట్టలేకపోతి.

మిగిలినోల్లు బద్దికాన్నించి జిల్లను ఎగరేసి కోడితో గట్టిగా కొట్టినారు. ఒగొగరు ఆ మాదిరిగా మూడుసార్లు కొట్టినారు. జిల్ల పసలమంద దాటుకోని పల్లెముందర గుట్ట దెగ్గిరికి పోయింది. ఆట్నించి వోల్లు ఒగరు మార్చి ఒగరు కుంటతా బద్దికాడికి వచ్చినారు. అప్పటికి మొబ్బయి పోయిండాది. అందరం ఇండ్లకుపోయినాం.

- సుంకోజి దేవేంద్రాచారి